

# డియర్! మళ్ళీ కలుస్తా

డియర్,

నన్ను మధుర స్వప్నాల సీమలో ఓలలాడించిన నిన్ను ఒదులుకోవడం అసంభవమని నాకు తెలుసు. నీ సన్నిధిలో ఈ విశ్వజగత్తును అవలీలగా మరిచి నీ సాన్నిధ్యంలో అమర సుఖాలు అనుభవించి, నేడు "నేను పెద్దలమాట కాదనలేను" అన్న వెధవ సూక్తితో నిన్ను దూరం చేసుకోడం మహా పాపం! కష్టాల్లో నన్ను నవ్వించావు! నా కన్నీళ్ళు తుడిచి నన్ను గాఢంగా చుంబించి నన్ను సంతోషపరిచెడి నీ స్నేహం వీడడం సాధ్యమా! స్వార్థరహితంగా నన్నుచేసే నిత్యం నీకు నీవు నాకర్పించుకుని, నాబాధలని నానుండి దూరంగానెట్టి నన్ను సుఖశాంతులలో ముంచి తేల్చిన


కె. వి. యస్. డి. ప్రసాద్ & స్త్రీపెసిసన్

పి స్నే హ ం విడిచిపెట్టడం తప్పనిసరి అనడం నా హృదయానికొక మాయనిగాయం.

నీవు చలం పుస్తకాలలో స్త్రీ లాంటి దానవు: అపూర్వమైన అందాలరాశివి త్రిజగన్మోహనాకారివి: బంగారు ఛాయలో అన్ని అందాలూ సమకూర్చుకుని నిత్యం శ్వేతవస్త్రాలను ధరించి కన్నులకు పర్వంగా నిత్యనూతనంగా కనిపించే నీ అందం అసమానమైనది. బ్రహ్మ మరిచి నిన్ను సృష్టించెను, లేకున్న సౌందర్యం లోగాని సుఖాన్ని పంచియిచ్చుటలోగాని నిన్ను మించిన వారెవరు? అత్యద్భుతమైన అందంనీది: వర్ణించడానికి అలవికాని సౌందర్యం నీసొంతం: హిమగిరి శిఖరంపై ఆనందంగా తేలియాడుతూ విహరించే గంధర్వకన్య నీముందు వెలవెలబోవును. నీముఖారవిందంలోగల కళాకాంతులను, తేజోవిస్ఫులను చూచి చందమామ మబ్బుల చాటుకు తొలుగును తప్ప సలు అందగత్తెనను గర్వంతో సీలిమాకసాన విహరిసూ భూలోకంలో అసమాన సౌందర్యంతో వెలిగి విరాజిలుతున్న నిన్ను గాంచి ఆశ్చర్యపడి, సూయచెంది, భయపడి, ఇంద్రభగవానుడు నిన్ను చూడకుండా వుండేందుకు తగుజాగ్రత్తలు తీసుకుంటారు లేకున్న వారికి స్థానభ్రష్టం తప్పదుకదా: అటువంటి నిన్ను విడిచి నేను బ్రతుకగలనా?

ఆనాడు వెండివెన్నెలమధ్య నిండు పున్నమిలో బంగారు తీగెలా మెరిసి పోతున్న నిన్ను చూశాను. నీవు తెల్లని చీరలో అప్సరసలనుమరిపించే దేవకన్యలా వున్నావు. ఈ అసమాన సౌందర్యరాశి చేయిపుచ్చుకుని ఈ చల్లని వెన్నెలలో విహరించేభాగ్యం నాకెప్పుడైనా కలుగుతుందా? అందుకు నేనర్హుడనేనా అని చాలాకాలం ఆలోచించాను. 'ప్రయత్నం మానవసహజం: ఫలితం అదృష్టంపై ఆధారపడివుంటుంది' అని తలచి నీకు చేరువగావచ్చాను నీవైపు చూడటానికే భయపడ్డాను తృణీకరిస్తే నాకు మిగిలిన బ్రతుకుపై ఆశపోతుందని వలకరించడానికే వెనుకాడాను అకస్మాత్తుగా నువ్వు నాపై పుచూశావు అతి నిశితమైన చూపది

"ఎవరీయువకుడు? నా స్నే హా న్ని కోరుతున్నాడు" అని మెత్తగా మందలించే చూపది అయితే అందులో తృణీకారభావంలేదని తృప్తి చెందాను. కొంతకాలం పోయాక ప్రయత్నిద్దామని వూరుకున్నాను కాని మనసంగీకరించలేదు మర్నాడు వచ్చి వచ్చాను, నిన్ను నా స్నేహితుడు గోపాలంతో చూశాను అసూయతో కుమిలిపోయాను నీస్నేహాన్ని వాడే పొందాడని- ఇంతలో వాడు నన్ను చూశాడు ముందు గాభరాపడ్డాను నేను నీ పరిచయం స్వీకరించడానికి సంకోచించినా తరువాత ధైర్యంగా 'గ్లాడ్ టు మీట్ యూ" అని చెయ్యి చాపాను సంకోచించకుండా నా




చేతిలో కొచ్చావు. ఆనందంలో నాకు వూపిరాడలేదు. విపరీతంగా దగ్గొచ్చింది. గోపాలం సముదాయించాడు. ఆనాడు ఆది వారం! పున్నమి! ఎంతమంచిరోజు! ఆ తరువాత మళ్ళీ ఎప్పుడూ నిన్ను గోపాలం తోటి చూడలేదు. నిత్యం నువ్వు నాతో వుండడం వాడు గమనించాడు

ఓరోజు వాడు నన్ను పిలిచి "పరిచయాలు పరిచయాలుగానే వుండాలిగాని ప్రాణాంతకం కాకూడదు" అని అన్నాడు

నాకు విపరీతంగా నవ్వొచ్చింది నవ్వుతోపాటు దగ్గొచ్చింది

"చూడు గోపాలం ఆమె సౌందర్య ఆరాధనలో నా ప్రాణాలుపోయినా నాకానందమే" అన్నాను.

ఙ్యోతి

"సరే అది నీకు ఆనందంకావచ్చు, కాని మొదట పరిచయం కల్గించింది నేను అందువల్ల నీ నాశనానికి నేను కారకుణ్ణి అవుతానేమో అని బాధపడుతున్నాను. అని అన్నాడు.

నాకు కొంత చిరాకుకూడావేసింది వాడి మాటలు వింటుంటే. అయినా స్నేహితుడుకదా అని "సరేలేరా! ఆవిడను కలవడం పూర్తిగా మానేస్తాను" అని అన్నాను.

దాన్తో ఆ అమాయకుడు (నిజమని నమ్మేసి) చాటంత ముఖంచేసుకుని "ఆమెను పూర్తిగా మర్చిపొమ్మన్నుగాని కొంచెం తగ్గించమంటున్నాను నువ్వు బాగువడితె సంతోషించేవాళ్ళల్లో నేను ప్రథముడిని"

అవి హితవు బోధించి మరీ వెళ్ళాడు.

వాడి అమాయకత్వానికి నవ్వుకున్నాను.

మన స్నేహం నిత్యం పచ్చగా పెరిగే వరిపైరులా పెరిగింది. చూచినవాళ్ళందరూ అసూయచెందారు. ఓనాడు, అంటే ఆనాటికి మనస్నేహం వయస్సు సంవత్సరం దాటిం దనుకుంటాను. ఆరోజు నిన్ను బీచ్‌లో కలిసాను. చంద్రుడు ఎందువల్లనో రోజూకన్నా దేదీప్యమానంగా వెలిగిపో తున్నాడు. అతని వెన్నెల కిరణాలు కెరటాలకు వెండిపూతలు పూస్తున్నాయి. ఆకిరణాల మెత్తని తాకిడికి కాబోలు కెరటాలు పువ్వెత్తున లేచిపడుతున్నాయి. గాలి మెత్తగా చల్లగా, వీస్తుంది. నీవు నాకు చాలా దగ్గిరగా కూర్చున్నావు. చలి వల్ల కాబోలు కాదు ప్రేమవల్లే! కదూ! నీకళ్ళలోకి గుచ్చిచూశాను మత్తుగావుంది మనోనేత్రం! నీచూపులో మదనుని ప్రభా వంవల్ల కాబోలు ఎర్రని చారలు ఏర్పడ్డాయి. నీవూపిరి నా ముఖానికి వెచ్చగా తగల సాగింది. చలించిపోయాను ఏనాడూ నిన్నింతగా చూడలేదేమో! చూస్తున్నకొద్దీ నీలో ఏవో కొత్తఅందాలు కన్పించ సాగాయి. ఇక ఆగలేక గాఢంగా హత్తు కుని మనసార చుంబించాను. ప్రపంచాన్నే మరిచిపోయి ఆనందాబ్ధిలో తేలియాడు తున్నాం. ఇంతలో!! ఇంతలో!!


విధి! . అమృత భాండంలో విషం చిలికిం ది.

చల్లని పిల్లగాలి ప్రచండప్రభం జనంగా మారింది.

నిర్మలమైన సరోవరంలో బండ రాయి పడి ఆ సరోవరాన్ని అల్ల కల్లోలంచేసింది.

మన ఆనందానికి అంతరాయం కలిగింది!!!

సహించలేక పోయాను. కానీ భయ పడక తప్పింది కాదు. కాలపాశాన్ని మెడకి తగిలించి నిర్దాక్షిణ్యంగా లాక్కు పోయే యముడిలా, ముద్దులొలికే మేక పిల్లను, దాని తలను ఒకే ఒక వేటుతో వేరుచేసే కసాయివాడిలా మా పెదనాన్న కన్పించాడు. ఎంతసేపటినుండి మనల్ని చూస్తున్నాడో తెలియదు కానీ కళ్ళ ల్లోంచినిప్పులు కురుస్తున్నాడు. ఆయనంటే మా కుటుంబంలో అందరికీ భయమే. ఆయనెప్పుడూ తప్పుచేసి వుండడు. తప్పు చేసిన వాళ్ళను నిర్దాక్షిణ్యంగా నేలవేసి కాలరాచేస్తాడు. బాగా డబ్బున్నవాడు బాగా పలుకుబడిగలవాడు. మా నాయన పోయిన తర్వాత నన్ను చావగొట్టి B. A. 1st Class లో పాసు చేయించిన వాడు ఎదురుగా నిలబడి నిప్పులు కురుస్తు న్నాడు. తప్పించుకోడానికి మార్గంలేక ఎదురుగా మృత్యు రూపంలో నెమ్మదిగా దరిచేరుతున్న బెబ్బులిని చూసి వణికి పోతున్న లేడిపిల్లలా వణికిపోయాను తుఫానుకి వణికిపోయే ఆరిటాకులా చలించిపోయాను. నిన్నలా యిసకలోనే వదిలి వినమ్రుడనై చేతులు కట్టుకుని నిల బడ్డాను వినకూడని, వినలేని పదాఘాతా లన్నీ తలవంచుకుని విన్నాను.




"పద యింటికి" సముద్రం లేచి పడిందాయన గర్జనకి. యిక నా సంగత దక్కా ఆశ్చర్యమేమిటంటే ఆయన నిన్ను పల్లెత్తుమాటనలేదు. కాని నీ ముఖంవంక ఎంతసహ్యంగా చూశాయన! అబ్బ. ఇప్పటికీ మరువలేను. దీనంగా, నిస్సహాయంగా నీ ముఖంవంక చూశాను. ఆశ్చర్యపోయాను నీ ధైర్యానికి! ఎంత ధైర్యం యిచ్చాడు నీకు భగవంతుడు. ఆయన కోపానికి ఏ మాత్రం చలించకుండా కనీసం లేచి నిలబడకుండా, ఇంకో మాట మాటాడితే కాల్చేస్తానన్నంత ఎర్రగా ఆయనవైపు చూస్తున్న చూపుకి అదిరిపోయాను. నీ ధైర్యానికీ, మనోస్థయిర్యానికీ మనసులోనే జోహార్లర్పించాను. నిన్ను వంటరిగా విడిచి వెళ్తున్నందుకు ఎంతగానో కుమిలిపోయాను. పిల్లను వీడి కసాయి వెనకాల వెళ్ళే తల్లిమేకలా ఆయనవెంట నేను వెళ్ళాను.

ఆ రోజు రాత్రి ఇంట్లో రౌండ్ టేబిల్ కాన్ఫెరెన్స్. శిఖరాగ్ర చర్చలు! మా పెదనాన్న దుమ్ము దులిపేశాడు ఇహ మరి అటు ఇంగ్లీషులోకాని, యిటు తెలుగులోకాని ఒక్క తిట్టు మిగలకుండా తిట్టాడు. తిట్టిన తిట్టు తిట్టకుండా గంటన్నర తిట్టాడంటే మరి లెక్కేసుకో!

ఇహ మా అమ్మ! ఏమీ తిట్టలేదు. నన్ను లోపలికి తీసుకెళ్ళి అవమానంతో కృంగిపోతున్న నన్ను ఓదార్చి అన్నం బలవంతంగా తినిపించి కళ్ళ నీళ్ళమధ్య హితబోధ చేసింది.

"చూడు నాయనా! చిన్నవాడివి కాదు చెప్పడానికి. మంచి చెడ్డలు నువ్వే నిర్ణయించుకోవాలి! అంత పెద్దాయన ఎందు

కంత ఆవేశబడ్డాడో కాస్త ఆలోచించు!"

"తిన్నది అరక్క" నోటి చివరిదాకా వచ్చింది. ఆపుకున్నాను.

"నా చినతమ్ముడు దీన్ని మరిగే క్షయతో మరణించిన విషయం నీకు తెలుసును కదా. నాకున్న ఆశల్లా నీ వొక్కడివే! నువ్వుకూడా యిలా పాడయిపోతే నే నిక బ్రతకడంలో నా కర్థం కన్పించటంలేదు" అని కొంగు నోట్లో కుక్కుకుంది.

"వూరుకోమ్మా! మరెప్పుడూ ఈ తప్పు చేయనులే!" అని ఆవిడ తృప్తి కోసం అనేశాను. నిన్ను కలవాలని మనసు ఆరాటపడసాగింది. ఇహ వుండలేక పోయాను. వెంటనే బయలుదేరాను మా పెద్దపులి ద్వారం దగ్గరే కాపుంటుందని నాకేం తెలుసు.

"మళ్ళీ ఎక్కడికి? ఈ శని నీ కెక్కడ తగిలిందిరా! మళ్ళీ ఆ దెబ్బతో నిన్ను చూశానా డొక్క చీరేస్తాను. జాగ్రత్త!" పులి గాండ్రించింది.


"కాదు! వూరికే అలా బయటకు వెళ్తున్నాను. మళ్ళీ ఈ తప్పుకి నే నెప్పుడయినా దొరికితే చెప్పుతీసికొట్టండి. అంతేగాని .... మర్యాద మిగలాలంటే మాత్రం మాటలు జారకండి" విసురుగా బయటికెళ్లి పోయాను.

ఆయన అరుపులు, పెడబొబ్బలు వీధి మలుపు తిరిగేవరకూ వినిపిస్తునే వున్నాయి. నిన్ను కూడా కలవ బుద్ధి కాలేదు. అలా రాత్రంతా తిరిగి తెల్లవారుఝామున 3 గంటలకి యింటికి చేరాను. అమ్మ గుమ్మం దగ్గరే కూర్చుని శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచించుకుని తెగ కుమిలిపోతూంది. మనసు అల్లకల్లోలమై పోయింది. నిజంగా చాలా బాధపడ్డాను ఆవిడ మనసు అంతగా నొప్పించినందుకు.

"అమ్మా" పిలిచాను.

నన్ను చూసింది. ఘొల్లుమంది. నాకూ కళ్ళంబట నీళ్ళొచ్చాయి. ఆవిడకోసమైనా ఇష్టం లేకపోయినా మా పెద్దనాన్నని క్షమాపణలు కోరుకున్నాను. ఏ మూడ్‌లో వున్నాడోగాని మరి తిట్టలేదు, నీ స్నేహం విడిచి పెట్టమని మాత్రం ఖచ్చితంగా మళ్ళీ చెప్పాడు. సరేలెండి అని బయటికొచ్చేసాను.

దరిదాపు పది పదిహేను రోజులనుకుంటాను నిన్ను చూడలేదసలు. పిచ్చెత్తిపోయాను. అన్నం సహించేది కాదు. నిద్దర పట్టేది కాదు. వెర్రివాడిలా అయిపోయాను. సగం చిక్కిపోయాను. ఇంట్లో కూడా అంతా గాభరా పడ్డారు. మా పెదనాన్న మాత్రం "యిలాగే వుంటే మాత్రం కొన్నాళ్ళకి తప్పకుండా వృద్ధిలోకొస్తాడు" అన్నాడు, నాకు కోపం కట్టు తెగిపోయింది అమ్మకిచ్చిన మాట గుర్తొచ్చి తమాయించుకున్నాను. కాని నీ విరహాన్ని మాత్రం సహించలేకపోయాను. ఏమైతే అయిందని నీ దగ్గరకొచ్చేశాను. ఆదరిస్తావన్న ఆశ అణుమాత్రం లేదు. తృణీ




కరిస్తే పాదాక్రాంతమవ్వడానికి సిద్ధపడి వచ్చాను. పలకరించాను (భయంగానే). మళ్ళీ అదే చూపు చూశావు. అతి నిశితమైన చూపది. అయితే అందులో కోపం, అసహ్యం అణుమాత్రం లేవు! మళ్ళీ పాడయిపోవడానికి వచ్చావా?" అన్నట్లుందా చూపు.

నిన్ను విడిచి బ్రతకలేనన్నాను. మరెప్పుడూ విడిచి పెట్టనన్నాను. నీ ముఖం దేదీప్యమానంగా వెలిగింది. గాఢంగా చుంబించాను అబ్బ! ఎన్నాళ్ళకీ సుఖం, విరహం తర్వాత కలయిక యింత మధురంగా వుంటుందా! ఆనందంతో తేలిపోయి ఊపిరాడక వుక్కిరి బిక్కిరి అయ్యాను. విపరీతంగా దగ్గొచ్చింది. తమాయించుకున్నాను. జాలిగా చూశావు నా వంక. ఆ చూపులో "నన్ను విడవలేవూ? నేనిచ్చే ఈ స్వల్ప సుఖంకోసం నీ ఉజ్వల భవిష్యత్తుని, ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటావా? నన్ను విడిచిపెట్టి హాయిగా బ్రతుకు." అన్న భావం గోచరించింది. చలించిపోయాను. నిన్ను విడిచి బ్రతకడమా! ఇంపాసిబుల్! నిన్ను విడిచి బ్రతకలేను, నిన్ను విడిచి బ్రతకలేను! ప్రకృతి ప్రతిధ్వనించింది నా ఆవేశానికి. నీవు చిత్రంగా నవ్వావ్!

కాని డియర్! ఇవాళ అంత పెద్ద రోజు నా జీవితంలో మరి రాదేమో! ఇవాళ యింతసేపు నీతో ఎందుకు మాట్లాడుతున్నానో తెలుసా? బహుశా నిన్ను మరి కలవనేమో! అలా చూడకు. ఆ చూపును భరించే శక్తి నాలో లేదు. నేను చెప్పేది సాంతం విను. నా ఆరోగ్యం బాగా చెడింది. మొన్న దగ్గు తెరొచ్చి పావు గంటసేపు ఊపిరి తిరక్కుండా దగ్గాను. ఉమ్మిలో రక్తపు చారలు చూడగానే

గుండె చల్లబడిపోయింది మనసంతా చికాకయిపోయింది. "మొగుడు కొట్టాడని కాదుగాని తోటి కోడలు ముందు కొట్టాడని దుఃఖపడిందట," అలాగ నాకు వ్యాధి సోకిందనికాదుగాని, అది నీసావాసం వల్ల నే వచ్చిందని అందరూ అంటారనీ, నా యెదుటనే నిన్ను దూషిస్తారని బాధ పడ్డాను. డాక్టరు దగ్గరకెళ్ళాను నా మనసులో మాట అతను బయటకు చెప్పాడు. నాకు క్షయవ్యాధి సోకిందని, అది నీ వల్లే వచ్చిందనీ. ఈ నిముషంనుండి నిన్ను విడువకపోతే ఓసంవత్సరంలో గ్యారంటీగా పోతానని చెప్పాడు. అదిరిపోయాను, నిన్ను విడిచేయడమా! మన అనురాగాన్ని అనుబంధాన్ని అతనికి చెప్పాను, అతను చాలాసేపు ఆలోచించి నేను నీ స్నేహం ఓ సంవత్సరంపాటు విడిచిపెడితే చాలు అని హామీ యిచ్చాడు. ఆయన ఫారిన్ రిటర్న్డ్, ఇప్పుడు చెప్పు డియర్ నీ స్నేహం విడవకుండా ఓ సంవత్సరం లోపల నిన్నూ, ఈ లోకాన్నీ శాశ్వతంగా విడిచి పెట్టేయమంటావా? లేక ఓ సంవత్సరంపాటు నీకు దూరంగా వుండి తర్వాత పదేళ్ళు పచ్చగా నీతో బ్రతకమంటావా?

జాలిగా చూసింది నావైపు. "సంవత్సరం తర్వాత వస్తావుకదూ?" అన్నట్టు చూసింది.

గాఢంగా హత్తుకున్నాను. "ఎంత మాటన్నావ్? నిన్ను విడిచి నేను బ్రతకగలనా! తప్పక మళ్ళీ నిన్ను కలుస్తాను సరేనా"

"మళ్ళీ కలుస్తానని నువ్వు హామీ యిస్తున్నా ఎందుకో దిగులుగా వుంది" అన్నట్టు చూసింది డియర్.

పిచ్చిదానా! ఏమిటా కన్నీళ్ళు! వస్తానన్నానుగా? ఆరోగ్యంగా వచ్చి నిన్ను వూపిరాడకుండా నా ముద్దులలో ముంచెత్తనూ!

కిల కిల నవ్వింది డియర్.

"మరి వెళ్ళిరానా?"

దిగులుగా చూసింది.

"అదిగో అలా అయితే నే నసలు వెళ్ళను."

"ఫర్వాలేదు వెళ్ళండి. కాని వీలయినంత త్వరలో నన్ను చేరుకోవాలి సరేనా" అన్నట్టు చూసింది.

"తప్పకుండా!" మనస్ఫూర్తిగా అన్నాను.

చివరిసారిగా గాఢంగా చుంబించి వదిలేశాను.

దీనంగా చూస్తూ టా! టా! చెప్తున్న నా "సిగరెట్ డియర్"కు కళ్ళ నీళ్ళ మధ్య టా! టా! చెప్పి, వడివడిగా హాస్పిటల్ వైపు నడిచాను

*

కోకి